క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


కేవీపీ రామచంద్రరావును సత్కరిస్తున్న షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎస్‌టీయూసీ) నాయకులు శుక్రవారం విశాఖలో మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీపీ రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన గెలిచిన నాయకులను అభినందించారు. సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. యూనియన్ జనరల్ సెక్రటరీ పి.ఎస్.ఆర్.మూర్తి, ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోలాటం మహిళలకు చీరల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు గొల్లవీధి ప్రాంతానికి చెందిన జైకృష్ణ కోలాట నృత్య బృందానికి చీరలు, దుస్తులను స్థానిక నాయకుడు మజ్జి సోమేష్ అందించారు. సామాజిక భవనంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సోమేష్ మాట్లాడుతూ చిన్నారులకు మంచి శిక్షణ ఇస్తున్న నూనెల లావణ్యను అభినందించారు.

జాబ్‌మేళాలో 131 మంది ఎంపిక

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 11 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 730 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 354 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 131 మంది ఎంపికై నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు సుబ్బిరెడ్డి, శాంతిల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు ఎంతో కృషి చేస్తోందని వారు అన్నారు. జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుబజార్‌లో కార్తీక వన సమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజార్‌లో శుక్రవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. రైతుబజారులో దుకాణాలు నిర్వహించే వారంతా సామూహికంగా ప్రాంగణంలో ఉన్న రావిచెట్టు వద్ద కార్తీక పూజలు చేశారు. జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ వేడుకలో పాల్గొని మాట్లాడుతూ రైతులందరినీ భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమం నిర్వహించడంపై ఈవో కొమ్మునాపల్లి వరహాలను ప్రత్యేకంగా అభినందించారు. రైతులకు ఆయన స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డీఈ నాగరాజు, ఏఈ కెనడీ, పెందుర్తి మార్కెట్ కమిటీ సెక్రటరీ అరుణ, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లుక్.. హైటెక్


ఎయిర్‌పోర్టు సెంటర్‌లో నిర్మించిన బస్‌బే





ఎన్‌ఏడీ బస్‌స్టాప్‌లో అదనపు వసతులు రూ.12 లక్షలు	ఎయిర్‌పోర్టు సెంటర్ బస్ బే రూ.36 లక్షలు
కాకానినగర్ బస్ బే	రూ.36 లక్షలు

పరిపాలన రాజధాని కానున్న విశాఖ ప్రగతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మహా విశాఖ అభివృద్ధి, సుందరీకరణకు పెద్దపీట వేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయిలు ఖర్చు పెట్టి నగరానికి హైటెక్ హంగులు అద్దుతోంది. ఇందులో భాగంగా స్మార్ట్ సిటీగా పేరొందిన నగరంలో అత్యాధునిక హంగులతో.. హైటెక్ లుక్‌తో స్మార్ట్ బస్ బేలు నిర్మించారు. ఆకర్షణీయమైన డిజైన్లలో ఆధునికీకరించిన బస్ షెల్టర్లు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.



విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో సుమారు రూ.84 లక్షల వ్యయంతో ప్రయాణికుల కోసం విశాలమైన.. సౌకర్యవంతంగా ఉండేలా బస్ బేలు నిర్మించారు. ప్రయాణికులు కూర్చునేందుకు పొడవైన గ్రానైట్ పలకలతో బెంచీలు, నడిచేందుకు ట్రాక్, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యుద్దీపాల వెలుగుల్లో బస్ బేలు మెరిసిపోతున్నాయి. వాటిని చూసి నగర ప్రజలు మురిసిపోతున్నారు.

నగరంలోని ప్రధాన సెంటర్లలో నిర్మించిన షెల్టర్లు ప్రయాణికులు వేచి ఉండేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. ఎన్‌ఏడీ మీదగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని సౌకర్యాలు కల్పించారు. ఒకవైపు గాజువాక, మరో వైపు పెందుర్తి, ఇటువైపు మర్రిపాలెం, అక్కయ్యపాలెం పరిసర కాలనీలకు ఇదే ప్రధాన సెంటర్ కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. **ఎన్‌ఏడీ కూడలిలో ఉన్న పాఠశాలలు, కాలేజీలకు వచ్చిపోయే విద్యార్థులతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉంటుంది. సిటీ బస్సులు, దూర ప్రాంత ఆర్టీసీ సర్వీసుల** కోసం వేచి ఉండే వారు ఇబ్బందులు పడకుండా బస్ షెల్టర్లు నిర్మించారు.

నాడు ఎన్నో ఇబ్బందులు

నగరంలోని ప్రధాన సెంటర్లలో వేచి ఉండేందుకు సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. టీడీపీ ప్రభుత్వంలో బస్ షెల్టర్ల సమస్యలపై పట్టించుకోలేదు. ఆర్టీసీ బస్సుల కోసం ఎండలోనే మండి, వాన వస్తే తడిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు ఉండేవి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రధాన సెంటర్లలో షెల్టర్లు నిర్మాణం చేపట్టారు.

మెరుగైన సౌకర్యాలు : ఎన్‌ఏడీ సెంటర్‌లో నిర్మించిన బస్ షెల్టర్లలో ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని షెల్టర్‌కు ఆనుకొని మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. వర్షం వచ్చినా, ఇబ్బందులు లేకుండా రేకుల షెడ్డు నిర్మించారు. మొత్తంగా రూ.12 లక్షల వ్యయంతో ఇక్కడ మౌలిక సౌకర్యాలు కల్పించారు.

సర్వాంగ సుందరంగా బస్‌బే లు

ఎయిర్‌పోర్టు నుంచి విశాఖ నగరంలోకి వచ్చే **వారిని దృష్టిలో** పెట్టుకొని బస్‌బేలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎయిర్ పోర్టు సెంటర్, కాకాని నగర్ సెంటర్‌లో రూ.36 లక్షల చొప్పున వ్యయంతో అధునాతన రీతిలో బస్‌బేల నిర్మాణం చేపట్టారు. ఎన్‌ఏడీ సెంటర్, సాకేత పురం, బాజీ జంక్షన్, కరాస వంటి చోట్ల ప్రయాణికులు వేచి ఉండేందుకు షెల్టర్లు అందుబాటులో ఉన్నాయి.

సౌకర్యవంతంగా ఉన్నాయి



బస్ షెల్టర్లు ప్రయాణికులు వేచి ఉండేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. గతంలో రోడ్లపైనే నిలబడేవారు. మా ఆటోలు కూడా రోడ్లపైనే నిలుబెట్టాల్సి వచ్చేది. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. ప్రయాణికులు వేచి ఉండేందుకు విశాలంగా షెల్టర్లు నిర్మించారు. ఎన్‌ఏడీ సెంటర్‌లో ఎన్ఎస్‌టీఎల్ వైపు కూడా మరుగుదొడ్లు నిర్మిస్తే మరింత మేలు జరుగుతుంది.

– వాసు, ఆటో డ్రైవర్, ఎన్‌ఏడీ ఆటోస్టాండ్

రద్దీ పెరిగినా ఇబ్బంది లేదు



దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసులకు ఎన్‌ఏడీ సెంటర్‌లో హాల్ట్ ఉంది. అందుకే ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. గతంలో అయితే సరైన సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. డిప్యూటీ మేయర్ శ్రీధర్‌కు సమస్య చెబితే వెంటనే స్పందించి మరుగుదొడ్లు నిర్మించారు.

– కొత్తలంక రమణ, ఆర్టీసీ గైడ్, ఎన్‌ఏడీ సెంటర్

సౌకర్యాల కల్పనపై శ్రద్ధ



ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జీవీఎంసీ ద్వారా ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నాం. 5వ జోన్ పరిధి ఎన్‌ఏడీ ప్రాంతం వైపు అవసరమైన చోట్ల షెల్టర్లు నిర్మించాం.

– ఏడు కొండలు, డీఈ, జీవీఎంసీ 5వ జోన్


కాకాని నగర్ సెంటర్‌లో నిర్మించిన బస్ బే


ఎన్‌ఏడీ సెంటర్‌లో నిర్మించిన మరుగుదొడ్లు

సంక్షేమ సారథి సీఎం జగన్

మల్కాపురం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే గొప్ప లీడర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకే ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పిలుపునిచ్చారు. వార్డులోని ములగాడ-1 సచివాలయం పరిధిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వార్డులో అమ్మఒడి పథకం ద్వారా 301 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.1.31 కోట్లు, విద్యా దీవెన ద్వారా 208 మంది విద్యార్థులకు రూ.68 లక్షలు, వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా సుమారు 267 మందికి రూ.2.59 కోట్ల జమ చేశారన్నారు. ఇలా పలు పథకాల ద్వారా రూ.13.75 కోట్లను ఈ ప్రాంత ప్రజలకు అందజేశారని వివరించారు.

విశాఖ వెస్ట్ క్లస్టర్-2 అధ్యక్షుడు అంగ రామ్ ప్రసాద్, పార్టీ 58, 59, 60 వార్డుల పరిశీలకుడు పిల్లా కన్నబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలపై డోర్ టూ డోర్ వెళ్లి కరపత్రాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, గోందేశి సత్యనారాయణరెడ్డి, ధర్మల వేణుగోపాల్ రెడ్డి, తోనంగి వెంకటరమణి, దాట్ల శ్రీనివాస్‌రావు(పొడుగు రాజు), ఎదుర రాజు తదితరులు పాల్గొన్నారు.


58వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్... కార్యక్రమంలో పార్టీ నాయకులు

జగనన్నతోనే సుపరిపాలన

సింధియా: అవినీతిని సమూలంగా పారదోలి, అనేక సంక్షేమ పథకాలతో సుపరిపాలనే లక్ష్యంగా అన్ని వ్యవస్థల్లోనూ మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం చరిత్రాత్మక అవసరమని వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. 40వ వార్డు ఏకేసీ కాలనీ సచివాలయం పరిధిలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. ఏకేసీ కాలనీ సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం బద్రీనాథ్ మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమ, విద్య, వైద్య రంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చి దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో సీఎం జగన్ నిలబెట్టారన్నారు.


40వ వార్డులో అందిస్తున్న బద్రీనాథ్ తదితరులు

కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరుగుతూ జగనన్న పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించే బుక్‌లెట్స్, కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో భోగవిల్లి నాగభూషణం, వరపల మహేష్, గంటా వర్మ, మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో పతకం సాధించిన ప్రకాశరావుకు సత్కారం


ప్రకాశ్‌రావును అభినందిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

గోపాలపట్నం: ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన విశాఖకు చెందిన మలపర్తి ప్రకాశ్‌రావును శుక్రవారం ఎంపీ జీవీఎల్ నరసింహారావు సత్కరించారు. జీవీఎల్‌ను ఆయన కార్యాలయంలో కోచ్ పాండ్రంగి రుక్మాకరరావు, క్రీడాకారుడు ప్రకాశరావు మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సినీతారల సందడి


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న అఖిల్


అభిమానులకు అభివాదం చేస్తున్న నాగార్జున

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయంలో అక్కినేని కుటుంబ సభ్యులు సందడి చేశారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు అక్కినేని నాగార్జున, అఖిల్ శుక్రవారం నగరానికి వచ్చారు. వీరిని చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నగరంలోకి వెళ్లారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చన్నారు.ఫ్రైడే-డ్రైడే ప్రతి ఒక్కరూ పాటించి ప్రతి శుక్ర, మంగళవారాల్లో నీటి పాత్రలను శుభ్రం చేసి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్తను తడి, పొడిగా వేరు చేసి అందించాలని సూచించారు. చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా.. వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా సూపర్‌వైజర్లు విజయకుమారి, దుల్లా శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది వంశీ, పార్వతి, తులసీ, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.


ఫ్రైడే-డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది

రాధాకృష్ణ మహోత్సవాలను జయప్రదం చేద్దాం


సమావేశమైన యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: ఈ నెల 26న విశాఖ బీచ్ రోడ్డులోని గోకుల్ పార్కు వద్ద జరగనున్న రాధాకృష్ణ మహోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి యాదవ సామాజిక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక యాదవ సంఘంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 50 ఏళ్లుగా నగరంలో రాధాకృష్ణ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి సమయంలో ఈ వేడుకలను ఎంతో వైభవంగా యాదవులంతా ఐక్యతతో జరుపుతున్నారన్నారు. ఈ ఉత్సవంలో భాగస్వాములు కావడం తాము చేసుకున్న అదృష్టమన్నారు. మహిళలు, పిల్లలు, పెద్దలు అంతా పాల్గొని రాధాకృష్ణులకు పాలు, పెరుగు, వెన్నలతో అభిషేకాలు చేసి తరించాలని కోరారు. ఆదివారం సాయంత్రం బైక్ ర్యాలీ ద్వారా పెద్ద ఎత్తున గోకుల్ పార్కు వద్దకు తరలి వెళ్దామని సంఘ ప్రతినిధులు, సభ్యులు పిలుపునిచ్చారు.

పీఎఫ్ కార్యాలయంలో సర్వర్ డౌన్


వేచి ఉన్న పింఛన్‌దారులు

విశాఖ విద్య: విశాఖలోని పీఎఫ్ కార్యాలయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి శుక్రవారం కార్యాలయానికి వచ్చిన పింఛన్ దారులు నిరాశతో వెనుదిరిగారు. మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని సిబ్బంది చెబుతున్నారు. పింఛన్ కొనసాగింపునకు ఏటా పింఛనుదారులు నవంబర్, డిసెంబర్ నెలలో తమ వివరాలు ధృవీకరించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం వారు కార్యాలయానికి క్యూ కడుతున్నారు. దీంతో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి, పింఛనుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ధృవీకరిస్తున్నారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా సెల్‌ఫోన్‌ద్వారా సిబ్బంది పింఛనుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే పింఛన్ దారుడి సెల్‌ఫోనుకు వచ్చే ఓటీపీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఆన్‌లైన్ సెంటర్లలో అవకాశం

పింఛనుదారులు తమకు సమీపంలోని ఆన్‌లైన్ సెంటర్లలో వివరాలు ధృవీకరించేకునే వెసులు బాటు ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ విషయం తెలియక జిల్లా నలుమూలల నుంచి విశాఖలోని పీఎఫ్ కార్యాలయానికి పింఛన్‌దారులు వస్తున్నారు. పింఛనుదారులకు అవగాహన కల్పిస్తే వారికి వ్యయప్రయాసలు తప్పుతాయి.

విస్తృతంగా వాహన తనిఖీలు


స్కూల్ ఆటోలను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా శుక్రవారం 24 ఆటోలపై కేసులు నమోదు చేశారు. మరో 13 వాహనాలను సీజ్ చేసినట్టు ఉప రవాణ కమిషనర్ రాజారత్నం తెలిపారు. ఎన్‌ఏడీ జంక్షన్, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు ఈ తనిఖీలు చేశాయని తెలిపారు. నిబంధనలు పాటించని 24 స్కూల్ ఆటోలపై కేసులు నమోదు చేశారు. అలాగే 13 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. అంతే కాకుండా 2 స్కూల్ బస్సులపై కూడా కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు కొసాగుతాయని.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు

ఎన్‌ఏడీ నుంచి పెందుర్తి వరకు పలు ప్రాంతాలతో పాటు మధురవాడ ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమాల్లో మోటారు వాహన తనిఖీ అధికారులు రామ్‌కుమార్, బాలాజీరావు, హరిప్రసాద్ రావు, ప్రవీణ్ కుమార్, రాజారావు, మాధవి, సుమన్ కుమార్, లలిత పాల్గొన్నారు.